నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 ఆదివారం 16 ఫిబ్రవరి 2025
MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## ముంజంపల్లి బీఆర్ఎస్ యూత్ కమిటీ ఎన్నిక


ముంజంపల్లి బీఆర్ఎస్ యూత్ కమిటీ సభ్యులు

బెజ్జూర్, ఫిబ్రవరి 15 : ముంజంపల్లిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బూస సారయ్య ఆధ్వర్యంలో గ్రామ యూత్ కమిటీని ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షుడిగా చాపిలే చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా కంబాల ముకుంద్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాముల మహేశ్, కోశాధికారిగా పొర్శెటి అంజయ్య, సలహాదారుడిగా ఏన్క ప్రభాకర్‌తో పాటు 30 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన యూత్ కమిటీ సభ్యులు పార్టీ పటిష్టతకోసం సైనికుల్లా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఖాజా మోహినుద్దీన్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు దుర్గం తిరుపతి, నాయకులు జాడి నాందేవ్, రత్నం తరుణ్, తలండి భిక్షపతి పాల్గొన్నారు.

## రేచిని-గోపాల్‌నగర్ అటవీ ప్రాంతాల్లో పులి సంచారం


పులి అడుగులను గుర్తిస్తున్న అటవీ శాఖ అధికారులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 15 : తాండూర్ మండలం రేచిని, గోపాల్‌నగర్ శివారులోని అటవీ ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ బీట్ ఆఫీసర్ గోపికృష్ణ తెలిపారు. శనివారం అటవీ శాఖ సిబ్బంది పెద్ద పులి అడుగులను గుర్తించారు. కొద్ది రోజులుగా అడవుల్లో పెద్ద పులి సంచారం అధికమైంది. కన్నాల, మాదారం, అంకుశం గ్రామాల్లోని అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తోంది. తాజాగా, రేచిని, గోపాల్‌నగర్ గ్రామాల శివారులోని అటవీ ప్రాంతాల్లోకి పెద్దపులి రావడంతో ఆయా గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు డప్పు చాటింపు చేయించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొలం పనులకు వెళ్లిన వారు, పశువుల కాపరులు త్వరగా ఇంటికి చేరుకోవాలని సూచించారు.


మొక్కలు నాటుతున్న బీఆర్ఎస్ నాయకులు

## 'వృక్షార్చన'ను విజయవంతం చేయాలి

చెన్నూర్, ఫిబ్రవరి 15 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా చెన్నూర్ పట్టణంలో ఈ నెల 17న నిర్వహించే వృక్షార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో మొక్కలు నాటి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, ఇదే మనం కేసీఆర్‌కు ఇచ్చే పుట్టిన రోజు కానుక అన్నారు. హరిత తెలంగాణ స్వాప్నికుడు, కేసీఆర్ సంకల్పానికి మద్దతుగా గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ వృక్షార్చన కార్యక్రమాన్ని తలపెట్టినట్టు వారు పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ మంత్రి బాపు, మాజీ జడ్పీటీసీ మోతె తిరుపతి, మాజీ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నవాజ్, మాజీ కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, జగన్నాథుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సాధన బోయిన కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు రాంలాల్ గిల్డా, నాయిని సతీష్, మేడ సురేశ్‌రెడ్డి, మానిశెట్టి శ్రీనివాస్, రవి, నెన్నల భీమయ్య, ఆశీష్, కారెంగుల శ్రావణ్, తిరుపతి సురేశ్, తగరం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గుట్టలు మాయం

- రాత్రీ పగలూ జేసీబీలతో తవ్వి తరలిస్తున్న మాఫియా
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం సమీపంలో జోరుగా మట్టి తవ్వకాలు


ఆసిఫాబాద్ సమీపంలోని గుట్టను తవ్వుతున్న జేసీబీ

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మట్టిమాఫియా బరితెగించింది. రాత్రికి రాత్రే గుట్టలను మాయం చేస్తున్నది. అధికారుల అండదండలతో రాత్రీ.. పగలూ అనే తేడా లేకుండా జేసీబీలతో ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తున్నది. కళ్ల ముందే జోరుగా దందా సాగిస్తున్నా అధికారులు 'మామూలు'గా తీసుకోవడం విమర్శలకు తావిస్తున్నది.



### మట్టి మాఫియా దాదాగిరి..

రెబ్బెన మండలం గోలేటి సమీపంలో వెంచర్లను డెవలప్ చేసేందుకు, కొత్తగా ఏర్పాటు చేస్తున్న జిన్నింగ్ మిల్లులు, భవనాలు, రోడ్ల నిర్మాణం కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కాంట్రాక్టర్లు అక్రమంగా మట్టితవ్వకాలు చేపడుతున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి దగ్గరలోని చిర్రకుంటకు వెళ్లే దారిలో ఉన్న పోచమ్మ ఆలయం సమీపంలోని గుట్టల వద్ద ఏకంగా జేసీబీలను పెట్టి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తూ లక్షలు దండుకుంటున్నారు. రోజుల తరబడి మట్టిని తోడుకెళ్లడం వల్ల గుట్టలు కనుమరుగై మైదానాలుగా మారుతున్నాయి. ఈ విషయమై ప్రశ్నిస్తున్న స్థానికులపై మట్టి మాఫియా దాదాగిరి చేసి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తున్నది. ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే ఈ వ్యవహారం సాగుతుండగా, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే సహజవనరులకు తీరని నష్టం కలగనున్నది.

# కరంటు తీగ ఏమైనట్లు!

కాంట్రాక్టరే తీసుకెళ్లాడంటున్న జిల్లా స్టోర్స్ అధికారులు

- తనకు తెలియదంటున్న కాంట్రాక్టర్
- కొనసాగుతున్న విచారణ



మంచిర్యాలలోని విద్యుత్‌శాఖ జిల్లా స్టోర్స్

మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి 15 : మంచిర్యాలలోని పాత మంచిర్యాలలో ఉన్న విద్యుత్ శాఖ జిల్లా స్టోర్స్ నుంచి కరంటు తీగ(కండక్టర్) మాయమైన అంశంపై గందరగోళం నెలకొంది. జిల్లా స్టోర్స్ నుంచి సంబంధిత కాంట్రాక్టర్ పూర్తి సామగ్రిని తీసుకెళ్లాడని, అందుకు సంబంధించి రిజిస్టర్‌లో సంతకం కూడా చేశాడని అధికారులు చెబుతుండగా, తనకు ఇవ్వాల్సిన సామగ్రి వాహనంలో పట్టకపోవడంతో 20 కిలో మీటర్ల కరంట్ వైరును స్టోర్స్‌లోనే ఉంచి వెళ్లినట్లు కాంట్రాక్టర్ చెబుతున్నాడు. ఈ విషయంలో జిల్లాస్థాయి విచారణతో పాటు కంపెనీస్థాయిలో విచారణ జరుపుతున్న అంశాన్ని రహస్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలో విద్యుత్ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మంచిర్యాలలోని జిల్లా స్టోర్స్ నుంచి 2023 జనవరి 20న సామగ్రిని తీసుకువెళ్లాడు. 2024 మార్చిలో తనకు సంబంధించిన సామగ్రి జిల్లా స్టోర్స్‌లోనే ఉందని చెప్పడంతో ఇక్కడి అధికారులు అలాంటిది ఏమీలేదని, అంతా అప్పుడే ఇచ్చామని తేల్చి చెప్పారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికెళ్లడంతో విచారణ జరిపారు. ఇటీవల కాగజ్‌నగర్‌కు వచ్చిన ఎన్‌పీడీసీఎల్ సీఎండీ దృష్టికి ఈ వ్యవహారం తీసుకువెళ్లారు. దీనిపై సమగ్ర విచారణ జరపాల్సిందిగా ఆయన ఆదేశించగా, వరంగల్‌కు చెందిన డీఈ స్థాయి అధికారి ఒకరు నాలుగు రోజుల క్రితం ఇక్కడికి వచ్చి విచారణ జరిపారు. తాము కాంట్రాక్టర్‌కు సామగ్రిని అంతా ఇచ్చేశామని, అధికారులు అందుకు సంబంధించిన సాక్ష్యాలను చూపించినట్లు తెలుస్తోంది. కాగా, దహెగాం మండలంలో విద్యుత్ అభివృద్ధి పనులకు సంబంధించి నెలలు గడుస్తున్నా పురోగతి కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన అధికారులు ఈ మేరకు విచారణ జరిపారు. దీంట్లో భాగంగానే సంబంధిత కాంట్రాక్టరును వారు అడుగగా తనకు రావాల్సిన సామగ్రి స్టోర్స్‌లో ఉందని చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది. 20 కిలో మీటర్ల 32కేవీలైన్ కరెంటు తీగ విలువ సుమారుగా రూ. 15 లక్షల వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. గందరగోళంగా మారిన ఈ అంశంపై ఉన్నతాధికారులు ఏం నిర్ణయం తీసుకుంటారోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# బీసీ కులగణన సర్వే లోపాలపై నిరసన

వెంటనే రీ సర్వే చేపట్టాలని బీసీ జేఏసీ నాయకుల డిమాండ్


నిరసనలో పాల్గొన్న బీసీ నాయకులు

మంచిర్యాల (ఏసీసీ), ఫిబ్రవరి 15 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణన సర్వే లోపాలను ఎత్తి చూపెడుతూ శనివారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలోగల అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ జేఏసీ నాయకులు నిరసన చేపట్టారు. బీసీ జేఏసీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికలకు ముందు బీసీలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. బీసీల జనాభాను తక్కువ చూపెట్టడం అంటే వారిని మోసం చేయడమేనని విమర్శించారు. ఎలక్షన్ కమిషన్ రిపోర్ట్, ఆధార్ కార్డులో ఉన్న రిపోర్ట్ ప్రకారం ఏమాత్రం ఈ సర్వే రిపోర్టు సరితూగడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రిపోర్టుపైన నిపుణుల కమిటీ వేసి, రీ సర్వే చేయించి ప్రజలకు వాస్తవాలు తెలియ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి బీసీ ప్రజలకు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో 42 శాతం అవకాశం కల్పిస్తూ చట్టబద్ధత చేయాలని డిమాండ్ చేశారు. బీసీ జేఏసీ మంచిర్యాల జిల్లా నాయకులు గజ్జెల్లి వెంకటయ్య, తులా మధుసూదన్ రావు, బీసీజేఏసీ చెన్నూరు ఇన్‌చార్జి ఆవిడపు గణేశ్, జిల్లా ప్రచార కార్యదర్శి డేగ నరేశ్, జైపూర్ మండల గౌరవ అధ్యక్షుడు ఇజ్జగిరి సమ్మయ్య, జైపూర్ మండల అధ్యక్షుడు వేముల మల్లేశ్, నస్పూర్ బీసీ జేఏసీ నాయకులు గరిగ చేరాలు, దేవసాని నాగరాజు, బీసీ జేఏసీ జిల్లా నాయకులు లింగన్నపేట విజయ్ కుమార్, గాజుల ప్రభాకర్ రావు, కొయ్యడా వెంకటేశ్వర గౌడ్, బీసీ జేఏసీ యువజన నాయకులు ఎండీ లతీఫ్, జంగంపల్లి శివకుమార్ పాల్గొన్నారు.


నస్పూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఆఫీస్‌లో మొక్క నాటుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

# ప్రజలంతా మళ్లీ కేసీఆరే సీఎం కావాలనుకుంటున్నారు

- హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలం
- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- కేసీఆర్ జన్మదినం సందర్భంగా జిల్లా పార్టీ ఆఫీస్‌లో హరితహారం

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 15 : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 13 నెలలు కావస్తున్నా హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పేర్కొన్నారు. ఈ నెల 17న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని నస్పూర్‌లోని మంచిర్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. దివాకర్‌రావు పార్టీ కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌కు చెట్లు పెంచడం అంటే ఎంతో ఇష్టమని, రాష్ట్రం పచ్చగా ఉండాలని ప్రతిష్టాత్మకంగా హరిత హారం కార్యక్రమాన్ని చేపట్టారని గుర్తుచేశారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఎలాంటి ఆడంబరాలకు పోకుండా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం 2001లో ఒంటరిగా బయలుదేరి కేసీఆర్ ఉద్యమాన్ని ఉర్రుతలూగించి, ఢిల్లీలో పార్టీల మద్దతు కూడగట్టి, అప్పటి కేంద్ర ప్రభుత్వం మెడలు వచ్చి తెలంగాణ తీసుకువచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించి దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపారని కొనియాడారు. కాంగ్రెస్ హామీలను నమ్మి ప్రజలు ఓటేస్తే మోసం చేసిందని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలంతా మళ్లీ కేసీఆరే సీఎం కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ హామీలపై ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని, అవినీతి అక్రమాలు, అబద్ధపు ప్రచారాలతో కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని ఆరోపించారు. ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటూ ప్రజల పక్షాన కొట్లాడుతుందని స్పష్టం చేశారు. కేసీఆర్ నిండూ నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సుబ్బయ్య, కార్యదర్శి పవన్, టీబీజీకేఎస్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు అత్తి సరోజ, నాయకులు గోగుల రవీందర్‌రెడ్డి, వంగ తిరుపతి, కుర్మిళ్ల అన్నపూర్ణ, మల్లెత్తుల రాజేంద్రపాణి, కాటం రాజు, జాడి భానుచందర్, రఫీక్‌ఖాన్, పొగాకు రమేశ్, అన్వేష్‌రెడ్డి, అమృత రాజ్‌కుమార్, తోట దుర్గాప్రసాద్, పెరుమాళ్ల జనార్దన్, బండారి తిరుపతి, తిరుమల్‌రావు, శ్రావణ్, పెద్దపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# వాణిజ్య వాహనాలకు మాత్రమే సెస్ వసూలు

- చెన్నూర్ ప్రాంత ప్రజలకు మినహాయింపు ఇస్తాం
- ఎఫ్ఆర్వో శివకుమార్

చెన్నూర్ టౌన్, ఫిబ్రవరి 15 : చెన్నూర్ ప్రాంతంలో రెండు చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, భారీ, స్థానికేతర (నాన్ లోకల్), వాణిజ్య వాహనాల నుంచి మాత్రమే పర్యావరణ సెస్ వసూలు చేయనున్నట్లు చెన్నూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్వో) శివకుమార్ తెలిపారు. శనివారం చెన్నూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కిష్టంపేట వై జంక్షన్, పారుపల్లి చింత వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల ద్వారా పర్యావరణ సెస్‌లో ఎక్కువ భాగం ఎన్‌హెచ్-63 ద్వారా ప్రయాణించే భారీ వాహనాల నుంచి మాత్రమే టోల్ వసూలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ మొదలైన నాన్‌లోకల్ నుంచి వస్తున్న అంతర్రాష్ట్ర వాహనాల నుంచి వసూలు చేస్తామని, చెన్నూర్ ప్రాంత ప్రజలకు చెందిన ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలవంటి వాటికి పర్యావరణ సెస్ తీసుకోబోమని స్పష్టం చేశారు. స్థానికులకు సెస్ నుంచి మినహాయింపు ఇచ్చామని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఎఫ్ఆర్వో వివరించారు. దీనిపై పూర్తిస్థాయిలో అవగాహన కూడా కల్పిస్తామని, చెన్నూర్ ప్రాంత ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో డీవైఆర్వో ప్రభాకర్, సెక్షన్ ఆఫీసర్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

### పారుపల్లి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు

కోటపల్లి, ఫిబ్రవరి 15 : గోదావరి నుంచి ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పారుపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి-63 సమీపంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారుల బృందం ఈ చెక్‌పోస్టులో 24 గంటల పాటు విధులు నిర్వహించనుండగా, ఈ మార్గంలో ఇసుక లోడ్‌తో వెళ్లే లారీల వివరాలు నమోదు చేయనున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చెన్నూర్ ఎఫ్ఆర్వో శివకుమార్


గోదావరి నది సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు


సమావేశంతో పాల్గొన్న డీఎంహెచ్‌వో, జిల్లా అధికారులు

# ఈ నెల 17 నుంచి విద్యార్థులకు కంటి పరీక్షలు

**మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్**

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 15 : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో ఈ నెల 17 నుంచి మార్చి 5వ తేదీ వరకు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్ తెలిపారు. శనివారం జిల్లా వైద్యాధికార్యాలయంలో విద్య, వైద్య శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. మొదటి విడుతలో 2024-ఏప్రిల్‌లో 164 గురుకులాల్లో 11,949 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశామన్నారు. ఇందులో 449 మంది విద్యార్థులకు కంటి సమస్యలు గుర్తించినట్లు తెలిపారు. 2024-ఆగస్టులో నిర్వహించిన రెండో విడుతలో 568 ప్రభుత్వ పాఠశాలల్లో 24 వేల మంది విద్యార్థులకు పరీక్షలు చేయగా, 694 మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించి రికార్డు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు విడుతల్లో గుర్తించిన పిల్లలకు వైద్యులు సరిత రాథోడ్, చంద్రబాన్, శిల్ప, జిల్లా అప్తాల్మిక్ అధికారి శంకర్ భాస్కర్ రెడ్డి, జిల్లా కంటి వైద్యాధికారి డాక్టర్ యశ్వంతరావు ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. నోడల్ అధికారిగా జిల్లా ఇమ్యూనేషన్ అధికారిణ డాక్టర్ అనితను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# 'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 15 : పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆ దిశగా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా విద్యా శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమన్నారు. వార్షిక పరీక్షలకు ఇంకా 30 రోజుల సమయమే ఉందని, విద్యార్థులు ఇంటి వద్ద కూడా పరీక్షలకు సన్నద్ధమయ్యే విధంగా చూడాలని తెలిపారు. ఇంట్లో టెలివిజన్, మొబైల్ వాడకుండా చూడాలని, పరీక్షల సమయాల్లో బయటకు తీసుకెళ్లడం తగ్గించాలని సూచించారు. విద్యార్థుల పురోగతిపై తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో మాట్లాడి తెలుసుకోవాలని, ప్రభుత్వం తరుపున జిల్లా యంత్రాంగం ప్రతి పాఠశాలలో విద్యారులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, అల్పాహారం, అదనపు తరగతులు నిర్వహించాలని, సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షా ఫలితాలలో జిల్లాను ముందంజలో నిలిపేందుకు సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గమ్మానియల్, జిల్లా గిరిజనాభివద్ధి శాఖ అధికారి రమాదేవి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్ పాల్గొన్నారు.


టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే